అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- జాబితాలో పేర్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలి
- అయోమయంలో దరఖాస్తుదారులు

శంషాబాద్ రూరల్, జనవరి 21 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అందుకోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి సంబంధిత అధికారులతో పాటు గ్రామస్తులు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు.

- ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న కొత్తరేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు నాలుగు పథకాలను అమలు చేయడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.
- కొత్తరేషన్‌కార్డు మంజూరు అనేది నిరంతర ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్లు గ్రామంలో ఇండ్లులేనివారికి మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు.
- రైతు భరోసా పథకంలో సాగుకు యోగ్యమయ్యే భూములకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు.
- రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామంలో సాగుకు ఉపయోగపడే భూముల జాబితా తయారు చేశారని వాటిని గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు తెలిపారు.
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో కూలీలుగా పనిచేసిన ఉపాధి కూలీలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతున్న సమయంలో గ్రామస్తులు కొందరు తమకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు మాత్రమే ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ అవకతవకలు జరుగుతున్నట్లు తెలిస్తే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి,తహసీల్దార్ రవీందర్ దత్, ఎంపీడీవో మున్ని,ఎంపీవో ఉషాకిరణ్, మాజీ సర్పంచ్ రాంగోపాల్,నాయకులు దర్గా సత్తయ్య, మైలారం భిక్షపతి, రాజ్‌కుమార్, గ్రామస్తులు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.
- మండలంలోని పెద్దతూప్రతండాలో కూడా గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

- శంషాబాద్ మున్సిపాలిటీలో

శంషాబాద్ మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందంచడం కోసం మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో సభలు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. ఆయా వార్డులలో ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక చేసిన్నట్లు తెలిపారు. వాటిని మరోసారి పరిశీలించి పథకాలు అందేవిధంగా చూస్తామని వివరించారు.

శంషాబాద్ మండలం కాచారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు

నార్సింగిలో నిర్వహించిన వార్డు సభలో మాట్లాడుతున్న నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్,జనవరి 21: విద్యుత్ కేబుళ్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు తదితర పనుల కారణంగా బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంగళవారం ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు.

- మైత్రీ వనం సబ్‌స్టేషన్ పరిధిలోని మైత్రీవనం సిగ్నల్, పెట్రోల్‌బంక్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంట్ సరఫరా ఉండదు.
- జూబ్లీహిల్స్ సబ్ స్టేషన్ పరిధిలోని డీకే. అరుణ నివాసం, బాలకృష్ణ నివాసం వెనకాల ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి 11:45 వరకు కరెంట్ సరఫరా ఉండదు.
- జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 17,చిరంజీవి బ్లడ్ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 12: 45 వరకు, టీవీ 5 చానెల్ సమీపంలో మధ్యాహ్నం 12: 50 నుంచి 1:20 వరకు కరెంట్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- బండ్లగూడ, జహంగీరాబాద్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఆలీనగర్, ఆయూషా కాలనీ, అహ్మద్‌నగర్, ప్లేస్ వ్యూ కాలనీ, కింగ్స్ కాలనీ, జహంగీరాబాద్, మిలాత్‌నగర్, రహమత్ కాలనీ, అబ్దుల్లా కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు క్రిస్టల్ టౌన్, మొగల్ కాలేజ్, రహమత్ కాలనీ, రాయల్ సీ హోటల్, వాదే ఈ ఫ్రోన్, సుభాన్ హిల్స్, అబ్దుల్లా కాలనీ, రాజీవ్ గాంధీనగర్, పటేల్‌నగర్, రహమత్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బేగంపేట్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్లకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడపడుచుల పెండ్లికి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ ఈ పథకాలను ప్రారంభించారన్నారు.

- గ్రామ సభలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

బండ్లగూడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ గ్రామలలో మేయర్ లతాప్రేమగౌడ్ అధ్యక్షతన అధికారులు గ్రామసభలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ హాజరై మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో రేషన్‌కార్డులు , ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి,కమిషనర్ శరత్‌చంద్ర,కార్పొరేటర్లు ముద్దంరాము,అస్లాంబిన్ అబ్దుల్లా, ప్రశాంత్‌నాయక్,కో ఆప్షన్ సభ్యులు మలాకిరత్నం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ..

రహ్మత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్ నగర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ కార్డుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – జూబ్లీహిల్స్,జనవరి 21

- అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం

అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, కమిషనర్ తదితరులు

మణికొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, నార్సింగి, కోకాపేట్, మీర్జాగూడ ప్రాంతాల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రజలకు వివరించారు.
ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాలవిజయ్, కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు అరికె దుర్గేష్‌యాదవ్, గంగిడి శివారెడ్డి, జి.అరుణ జ్యోతి, జి.వెంకటేష్‌యాదవ్, లంకల పద్మ, కూతాటి నరేష్, గండపేట మండల తహసీల్దార్, నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పూర్తి

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14 వెంకటేశ్వరనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్,జనవరి 21: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14 వెంకటేశ్వరనగర్ బస్తీ ప్రధాన రహదారిలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి చొరవతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఆరునెలల క్రితం మంచినీటి లైన్ కోసం తవ్వకాలు జరిపిన అధికారులు వివిధ కారణాలతో రోడ్డు పనులు ప్రారంభించలేదు. అయితే స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితిలో రోడ్డు వేయాల్సిందే అంటూ సోమవారం రాత్రి కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి స్వయంగా అక్కడే ఉండి పనులు చేయించారు. రోడ్డుపనులను అడ్డుకునేందుకు కొంత మంది స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకోగా పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎవరికైనా సమస్యలు ఉంటే తాను పరిష్కరిస్తానని, రోడ్డు పనులను అడ్డుకోవడం సరికాదని కార్పొరేటర్ అందరికీ నచ్చజెప్పడంతో పనులు పూర్తయ్యాయి.

హాట్ బాక్సులు అందజేత

బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు, టీచర్లకు హాట్ బాక్సులను పంపిణీ చేస్తున్న రమేష్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 21: సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతుందని రమేష్‌రెడ్డి సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లకు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు హాట్ బాక్సులను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు పలకలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి వారికి కావాల్సిన సదుపాయాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కె.శేఖర్, వీరేష్, శంకర్, మురళీ, కిరణ్, రోహిత్, వినయ్, అంగన్‌వాడీ టీచర్లు అనిత, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో హమాలీ కార్మికులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బాల్‌రాజ్

హిమాయత్‌నగర్,జనవరి21: సివిల్ సప్లైలో పనిచేసే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో మెదక్ జిల్లాలోని సివిల్ సప్లైయ్‌లో పనిచేసే పలువురు హమాలీలు ఏఐటీయూసీలో చేరారు. బాల్‌రాజ్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఏఐటీయూసీలో చేరిన వారిలో డి.సాయిల్,అశోక్,నాగరాజు, కుమార్, టి.సాయిల్,టి.ప్రకాశ్,మహేందర్, రమేష్, ఎన్.నాగరాజులు ఉన్నారు.

అనాథ పిల్లలకు దుప్పట్లు పంపిణీ

అనాథ పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి

వెంగళరావునగర్,:చలితో ఇబ్బందులు పడే అనాథులైన ఆ చిన్నారులను చూసి కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి పి.వి.రవిశేఖర్ రెడ్డి చలించిపోయారు. కళ్యాణ్ నగర్ వెంచర్ శ్రీ సారథి సొసైటీ వద్ద ఉన్న శ్రీ ఆదర్శ అనాథ శరణాలయంలోని పిల్లలు రాత్రి వేళల్లో చలిత వణుకుతూ ఉండటాన్ని గమనించిన ఆయన తన సొంత ఖర్చుతో దుప్పట్లు,పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు మాచర్ల పీటర్ పాల్, నాగరాజు, వనోద్ కుమార్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జనవరి 21: చిరు వ్యాపారాలు చేసుకునే వారిని ఇబ్బందులకు గురి చేయొద్దని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లకు చెందిన పలువురు పుత్‌పాత్ వ్యాపారులు మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో కలిసి వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 ఏండ్ల తెలంగాణ ప్రభుత్వంలో ఏ రోజు కూడా వ్యాపారులను ఇబ్బందులు పెట్టలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్ష్య సాధింపు చర్యలతో పుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈనెల 23న జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి మినిష్టర్ రోడ్డు, జవహర్ జనతా, మోండా మార్కెట్ లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, పుట్‌పాత్ వ్యాపారులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు ప్రారంభం

నారాయణగూడలో విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న గద్వాల్ విజయలక్ష్మి

హిమాయత్‌నగర్,జనవరి21: నగరంలో సుందరీకరణకు పెద్దపీట వేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి నారాయణగూడ, వైఎంసీఏ చౌరస్తాలో రూ.87. 60లక్షల వ్యయంతో చేపట్టిన వాటర్ ఫౌంటెన్, రూపు ఓవర్ లైటింగ్,డెకరేషన్ విద్యుత్ దీపాలను ఆమె ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్,డీసీ మారుతీ దివాకర్,ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఎస్ఈ రత్నాకర్,విద్యుత్ ఈఈ సంతోష్ వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడి మల్కాపూర్ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్‌ముదిరాజ్

కార్వాన్, జనవరి 21: గుడిమల్కాపూర్ మార్కెట్‌లను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు రైతుల సమస్యలు, వినియోగదారుల ఇబ్బందులను పరిష్కరించి సౌకర్యాలు మెరుగు పరుస్తానని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్ అన్నారు. మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి మార్కెట్ స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్‌లతో పాటు పూలమార్కెట్ కొనసాగుతున్నదని తెలిపారు. మార్కెట్‌లోకి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతే కాకుండా గత కొంత కాలంగా మార్కెట్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి మార్కెట్ రెవెన్యూను పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్‌లో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తానన్నారు. మార్కెట్ రెవెన్యూ పెంపునకు అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి చేయాలన్నారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. మార్కెట్‌ను మరింత అభివృద్ధి పర్చేందుకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పాటుపడ్తానని తలారి మల్లేశ్‌ముదిరాజ్ పేర్కొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

హిమాయత్‌నగర్,జనవరి21: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్,ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేతలు ఎం.బి.విజయ్ కుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు.కార్మికుల పట్ల కేంద్రం అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 5న జరిగే నిరసన కార్యక్రమాలలో కార్మిక వర్గం అధిక సంఖ్యల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

మహిళ అదృశ్యం

అఖిల (ఫైల్)

శంషాబాద్ రూరల్, జనవరి 21 : కిరాణ దుకాణానికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దతూప్ర గ్రామానికి చెందిన తెలగమల్ల అఖిల (36) ఇంటి వద్దనే ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయం లో ఇంట్లో నుంచి కిరాణాషాపు దగ్గరికి వెళ్తునట్లు చెప్పి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా పలుమార్లు ఇలాగే చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిందన్నారు. ఆమె పలుమార్లు తల్లిదండ్రులతో తనవద్దకు వస్తే పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకొని ఇంట్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సీసీ రోడు పనుల పరిశీలన

గోల్నాక, జనవరి 21: అంబర్ పేట డివిజన్ బాపునగర్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ పర్యటించారు. బాపునగర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కార్పొరేటర్ వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆరాంఘర్ చౌరస్తాలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, విద్యార్థులు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 21: ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహవీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఆరాంఘర్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు, ప్రజలు, పోలీసులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదేవిధంగా హెల్మెట్, సీట్ బెల్టులు ధరించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దు అని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గణేష్, ఎస్సై రాజేందర్, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, మహవీర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖరారుకాని గ్రామసభల తేదీలు

డీసీ జాకియా సుల్తానా..

యూసుఫ్‌గూడలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై సమీక్ష

జూబ్లీహిల్స్,జనవరి 21: రేషన్ కార్డుల పంపిణీకి గ్రామ సభల తేదీలు ఇంకా ఖరారు కాలేదని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. మంగళవారం ఇందిరమ్మ ఇండ్లపై రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయాలలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీసీ జాకియా సుల్తానా మాట్లాడుతూ.. గ్రామ సభలపై ప్రజలు అయోమయానికి గురికావద్దని సూచించారు. ప్రభుత్వం నుంచి షెడ్యూల్ విడుదల కాగానే ఆయా వార్డులలో నిర్వహించే గ్రామ సభల తేదీలు ప్రకటిస్తామని వెల్లడించారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌లో 39 వేల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు వచ్చాయని.. ప్రజలు సహకరించి సర్వే విజయవంతం చేయాలని కోరారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇప్పటివరకు 26,562 ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తిచేసినట్లు తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో కుటుంబ సర్వేలో నమోదైన కొత్త రేషన్ కార్డుల పరిశీలన పూర్తయిందని తెలిపారు.
ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వేలో పేరులేని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయంలో ఏఎంసీ కమల్, రహ్మత్ నగర్ వార్డు కార్యాలయంలో ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client **Sri. PEDDINENI VENKATESWARLU S/o. P SRI RAMULU,** R/o. House No. 10-134, K K Nagar, Phase-2, Gandhamguda, Gandipet Mandal, Ranga Reddy Dist, was in the custody of the original documents relating to his property i.e., Plot No. 134, in Sy.No. 89/P (Old R Sy No. 53/1 & 53/2) admeasuring 115.00 sq. yards or 85.14 sq. Meters, situated at **GANDHAMGUDA Village** Gandipet Mandal, Ranga Reddy Dist, but the **Original Sale Deed No. 777/2016 Dt: 29-01-2016 Regd. at SRO Rajendranagar** which stands on the name my client **SRI. PEDDINENI VENKATESWARLU** been lost/misplaced by his while Travelling by Bike From Gandhamguda Towards Narsingi on 15-12-2024 recently and to that effect my client also made a complaint before police officials.

If any person or person(s) who came across the custody of the said Original Sale Deed No. 777/2016 Dt: 29-01-2016 Regd. at SRO Rajendra nagar be pleased to hand-over to the undersigned or to my client.

Sd/- **K.SATYANARAYANA**
Advocate
Budvel (v) Rajendra Nagar, Hyd.
Ph.No. 9440039317